ఎన్టీఏను తక్షణమే రద్దు చేయాలి

- ఓయూ ఆర్ట్స్‌కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన
- పలు విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెల్లుబికిన ఆందోళనలు
- సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీలు

''విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ, వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుతున్న ఎన్టీఏ వ్యవస్థపై, ఎన్డీఏ ప్రభుత్వ తీరుపై నగర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ లాంటి పలు విద్యార్థి సంఘాలు, పలు వామపక్ష పార్టీలు గురువారం పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తూ, ఆందోళన బాట పట్టాయి. పోటీ పరీక్షలైన నీట్, నెట్‌లను అవకతవకల మధ్య నిర్వహిస్తూ విద్యా రంగాన్ని దేశ వ్యాప్తంగా ఎన్టీఏ వ్యవస్థ చిన్నా భిన్నం చేస్తున్నదని, ఈ నేపథ్యంలో భావి పౌరుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదన్నారు. ఇంత జరుగుతున్నా ఎన్డీఏ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని విద్యార్థి, నిరుద్యోగ లోకం నుంచి పెద్ద పెట్టున నిరసనలు పెల్లుబుకుతున్నాయి.''

ఆర్ట్స్‌కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

షాపూర్‌నగర్ రైతు బజార్ వద్ద నిరసనలో సీపీఐ వర్గీయులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 20: దేశ వ్యాప్తంగా విద్యారంగంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. పరీక్షల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన కోరారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ మానవ వనరుల శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. పోటీ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని మండిపడ్డారు. యూజీసీ నెట్ పరీక్షను ఏటా కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించేవారని గుర్తు చేశారు. ఈ ఏడాది దానిని ఎత్తివేసి, ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించడం వెనుక కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి నాయక్, మల్సూర్, హుస్సేన్, కృష్ణ, శ్రీను, అరవింద్, పవన్, రాజ్‌కుమార్, శ్రీనాథ్, భవాని, నిర్మల, రమ్య, ముక్తి సౌజన్య పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

జాతీయ స్థాయి అర్హత పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, దాని గుట్టుపును తక్షణమే రద్దు చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు విద్యార్థి నాయకులు ఓయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నరసింహ మాట్లాడుతూ, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని తెలిసినా, సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ఓ, బీఎస్ఎఫ్, డీబీఎస్ఏ, ఓయూజేఏసీ సంఘాల నాయకులు ఆర్ఎల్ మూర్తి, నరేశ్, ఎస్.నాగేశ్వరరావు, వేణుగోపాల్, జంగిలి దర్శన్, బోనాల నగేశ్, అల్లూరి విజయ్, రవినాయక్, నెల్లి సత్య, సుమంత్, సురేశ్, రవికుమార్, అభిలాష్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి: సీపీఎం

సైదాబాద్ : నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఎం హైదరాబాద్ సౌత్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ చౌరస్తాలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్లు లీకైనట్లు బయటపడినా, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాల్లో ఆడుకుంటుందన్నారు. లీకేజీకి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పరీక్షను వెంటనే రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బాలు నాయక్, కోటయ్య, విఠల్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షతీరుపై విచారణ జరగాలి: సీపీఐ

జగద్గిరిగుట్ట, జూన్ 20: నీట్ ప్రవేశ పరీక్ష లీకేజీ కారకులను శిక్షించేలా న్యాయ విచారణ జరపాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్ రైతు బజార్ వద్ద గురువారం నిరసన తెలిపారు. రాష్ట్రాలే నిర్వహించేలా పారదర్శక విధానం తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌కు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీరప్ప, స్వాతి, వెంకన్న, దేవదానం, కరుణాకర్, శ్రీను, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఓయూలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

ఐఎస్ సదన్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం కమిటీ నాయకులు

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

యూటీఏసీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎ.పరశురాం

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 20: తెలంగాణ రాష్ట్రంలోని 12 ప్రభుత్వ యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (సి) తెలంగాణ స్టేట్ (యూటీఏసీటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏ.పరశురాం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం, పరశురాం మాట్లాడుతూ, ఎంతో కాలంగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. దానికి సంబంధించి కార్యాచరణను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అప్పటి వరకు యూజీసీ ఏడో పీఆర్‌సీ ప్రకారం, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పదవీ విరమణ ప్రయోజనాలు లేకుండా, రెగ్యులరైజ్ కాకుండా పదవీ విరమణ చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ బాలకోటి, శ్రీశైలం, డాక్టర్ అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి హర్షణీయం

మంత్రి పొన్నం ప్రభాకర్

మెడిసిన్ విద్యార్థి ప్రశాంత్‌కు బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

చర్లపల్లి, జూన్ 20: అన్ని వర్గాలతో పాటు విద్యార్థుల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర బీసీ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ చక్రీపురానికి చెందిన పెరపు నర్సింహ, దేవమనిల కుమారుడు ప్రశాంత్ ఉస్మానియా వైద్యశాలలో ఎంబీబీఎస్ చదువుతూ ఫీజు కట్టకపోవడంతో స్థానికులు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో మెడిసిన్ సీట్ సాధించిన పేద విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఐదేండ్ల ఫీజులు చెల్లించడం హర్షణీయమన్నారు. నియోజకవర్గ పరిధిలో పేదల సంక్షేమం కోసం ట్రస్ట్ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకునేందుకు బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి చేస్తున్నదని, ఇప్పటికే పలు విభాగాలకు చెందిన కోర్సులలో పేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ఫీజులు చెల్లించామని ఆయన తెలిపారు. అదే విధంగా విద్యార్థులు, యువత కోసం పలు రంగాలలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేశ్ గౌడ్, నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలతో పాటు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దక్షిణాదికి ఏం చేశారని ప్రియాంకా గాంధీని గెలిపించాలి

ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 20: ప్రియాంకా గాంధీని వయనాడ్ ప్రజలు ఎందుకు గెలిపించాలని?, దక్షిణ భారతదేశానికి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని? దక్షిణ భారత జేపీసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ప్రశ్నించారు. దక్షిణాదికి హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1955లో ప్రతిపాదిస్తే 60 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, పదిహేనేళ్లుగా పరిపాలిస్తున్న బీజేపీలు ఎందుకు పట్టించుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తార్నాకలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడారు. దక్షిణాదికి సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు, దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి, దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్, దక్షిణాది భాషల అభివృద్ధి మండలిలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ హోదా, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరానికి జాతీయ హోదా, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ... ఇలా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న ఈ ఒక్క హామీని ప్రభుత్వాలు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. అటువంటి కాంగ్రెస్, బీజేపీలను దక్షిణాదిలో ఓడించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాదికి చెందిన రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి ఐదేళ్లు ఎంపీగా ఉండి, ఏమీ పట్టించుకోలేదని ఆరోపించారు. తిరిగి ఢిల్లీకే పరిమితమయ్యే ప్రియాంకను ఎందుకు ఎంపీగా ఎన్నుకోవాలో చెప్పాలని సవాల్ విసిరారు.

నాటక కళాకారుల సమస్యలను పరిష్కరించండి

- కళాకారుల సమాఖ్య విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి

తెలుగు యూనివర్సిటీ, జూన్ 20: నాటక రంగం అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని సాంస్కృతిక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య నూతన కమిటీ గురువారం మంత్రి జూపల్లిని క్యాంపు కార్యాలయంలో కలిసి నాటక కళాకారుల సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు ఆకుల సదానందం మాట్లాడుతూ, ప్రాచీన నాటక కళను పరిరక్షిస్తున్న కళాకారులను సంక్షేమానికి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కృషి చేయవలసిన అవసరం ఉందని గుర్తు చేసినట్లు తెలిపారు. నాటక రంగ సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షన్ల చెల్లింపులు, పరిషత్ పోటీలు నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న బిల్లుల గురించి మంత్రితో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో నగరంలో నిర్వహించనున్న కళాకారుల సమావేశానికి హాజరవుతానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి జూపల్లి సానుకూలంగా స్పందించినట్లు సదానందం తెలిపారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రాంచందర్, ప్రధాన కార్యదర్శి సాదు శ్యాంప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మారం రాజు రామచంద్రారావు, కోశాధికారి యన్.సూర్యవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సోమా అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి యస్.రామాచారి, సభ్యులు జి.సుదర్శన్, ఏ.మోహన్‌రావు, గౌరవ సలహాదారు బాద్మి శివ కుమార్ తదితరులు మంత్రిని కలిసి తమ కళాకారుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి జూపల్లికి బొకేతో పాటు వినతి పత్రం అందజేస్తున్న సమాఖ్య కమిటీ సభ్యులు

బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

సిటీబ్యూరో, జూన్20(నమస్తే తెలంగాణ): ఆషాఢ మాసంలో నెల రోజుల పాటు జరుపుకునే బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం బోనాల జాతర ఉత్సవాలు-2024పై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో 2400 దేవాలయాలు ఉన్నయాని చెప్పారు. దేవాలయాలకు అందించే డబ్బులను పెంచడంపై దృష్టి సారించామని చెప్పారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క. చిత్రంలో తదితరులు

మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 20: ఆర్థిక, సామాజిక రంగాలలో మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, రాష్ట్ర పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ టీజీ ఐఆర్‌డీ సమావేశం మందిరంలో గురువారం జరిగిన డీఆర్‌డీఓల రాష్ట్ర స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామీణ మహిళలు సైతం ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానికంగా ఉండే ముడి సరుకులకు నాణ్యత లోపించకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దే విధంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆహార పదార్థాలను తయారుచేసే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్‌ల చేతుల్లో సామాన్యులు బందీలుగా మారి, అనేక వేధింపులకు గురయ్యారని గుర్తు చేశారు. మహిళలను లక్ష్యాధికారులుగా మార్చడమే సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యలో కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. నాటి నుంచే మహిళా ఓరియెంటెడ్, సెర్ప్ సంస్థలను ప్రోత్సహించి మహిళలను చైతన్యం చేసిందన్నారు. రాష్ట్రంలో కల్తీ ఆహారం కోరలు చాచిందని, నీళ్లు, పాలు ఏ ఆహారం తీసుకున్నా కల్తీ లేన్నారు. మహిళా సంఘాల చేత నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తే తప్పా, ప్రత్యామ్నాయం లేదన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరి సుల్తానియా, టీజీఐఆర్‌డీ డైరెక్టర్ కాత్యాయినీ వైది, రవి కిరణ్, శఫిల్లా, అఖిల్, విద్యాసాగర్ పాల్గొని పలు సూచనలు చేశారు.

'ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం'

గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలోని సమావేశం మందరంలో ధూళిపాళ అరుణ రచించిన 'ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం' గ్రంథావిష్కరణ-అంకితోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, విశిష్ట అతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, రచయత్రి నెల్లుట్ల రమాదేవిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం గ్రంథాన్ని ఆవిష్కరించి, గ్రంథాన్ని ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు అంకితం చేశారు. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, అనుమాండ్ల భూమయ్య గొప్ప సాహితీవేత్త అని, సాహిత్య రచనా విధానంలో పద నిర్దేశం చేసిన గురుతుల్యులు అని ఆయన కొనియాడారు. రచయిత్రి ధూళిపాళ అరుణ చాలా అద్భుతంగా రచించారని తెలిపారు.

భూమయ్య సాహిత్యావలోకనం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

నేటి నుంచి 23 వరకు యూపీఎస్సీ పరీక్షలు

సిటీబ్యూరో, జూన్20(నమస్తే తెలంగాణ): నేటి నుంచి 23వ తేదీ వరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ - 2024 పరీక్ష సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని హైదరాబాద్ అదనపు కలెక్టర్ హేమంత్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నగరంలో మెహిదీపట్నంలోని అరబిందో జూనియర్ కాలేజీ, దిల్‌షుక్‌నగర్‌లోని సాయి చైతన్య జూనియర్ కాలేజీ, హిమాయత్‌నగర్‌లోని న్యూ చైతన్య కాలేజీ, దిల్‌షుక్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కాలేజీలు సెంటర్లు అని తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు.

జోయలుక్కాస్ స్పెషల్ ఆఫర్

Joyalukkas
World's favourite jeweller
www.joyalukkas.com

సిటీబ్యూరో, జూన్ 20(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ఆభరణాల తయారీ సంస్థగా గుర్తింపు పొందిన జోయలుక్కాస్ ఇన్‌క్రెడిబుల్ జువెల్లరీ సేల్స్ పేరిటో సరికొత్త ఆఫర్లను మార్కెట్లోకి తీసుకువచ్చింది. దేశ వ్యాప్తంగా విస్తరించిన జోయలుక్కాస్ జువెల్లరీ షోరూమ్‌లలో కొనుగోలు చేసే కస్టమర్లకు మజూరీ ఛార్జీలపై 50 శాతం డిస్కౌంట్‌తో ఆభరణాలను అందిస్తున్నట్లుగా ఓ ప్రకటనలో పేర్కొంది. జూన్ 14న ప్రారంభించిన ఈ ఆఫర్‌లో వజ్రాభరణాలు, బంగారు, ఫ్రెషస్ స్టోన్స్, వెండి వంటి విస్తృత శ్రేణిలో జువెల్లరీని అందిస్తున్నట్లుగా పేర్కొంది. అదే విధంగా మగువలు మెచ్చే వైవిధ్యమైన కలెక్షన్లను ఈ సీజన్‌లో మార్కెట్లోకి తీసుకువచ్చినట్లుగా నిర్వాహకులు తెలిపారు.

నేడు నలుపు దుస్తులతో విధుల్లోకి జూడాలు

- జూనియర్ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి
- సమ్మె నోటీసిచ్చి మూడు రోజులు
- ప్రభుత్వం నుంచి స్పందన కరువు: టీ జూడా

ఉస్మానియా మెడికల్ కళాశాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న తెలంగాణ జూడాలు

సుల్తాన్ బజార్, జూన్ 20: జూనియర్ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో టీ జూడాలు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె నోటీస్ ఇచ్చి మూడు రోజులవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం నల్ల దుస్తులు ధరించి విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. తమ సమస్యలతో పాటు తాము పడుతున్న బాధలను, జూడాల ఐక్యతను చాటేందుకు నల్ల దుస్తులు ధరించి విధులను నిర్వహిస్తున్నట్లు జూడాలు వివరించారు. ఈ నెల 24 నుంచి టీ జూడా సమ్మెను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు దేశానికి సేవలందించేలా ఎదగాలి

- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవి గుప్తా
- ఘనంగా సిల్వర్ ఓక్స్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం

పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులతో డీజీపీ రవిగుప్తా, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ తదితరులు

దుండిగల్, జూన్ 20: విద్యార్థులు ఉన్నతులై దేశానికి సేవలందించాలని డీజీపీ రవి గుప్తా అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేసిన ఓక్విండ్స్ క్యాంపస్ ప్రథమ వార్షిక వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు తెలంగాణ డీజీపీ రవిగుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 60 అడుగుల జాతీయ పతాకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సిలబస్‌తో పాటు పాఠ్యేతర కార్యకలాపాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదలను పెంపొందించే సంపూర్ణ విద్యను నేర్పించాల్సిన అవసరమున్నదన్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులు పోలీస్ శాఖ పట్ల అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగి దేశానికి సేవ చేయాలన్నారు. అంతకు ముందు డీజీపీకి సిల్వర్ ఓక్స్ స్కూల్ ఎయిర్ ఎన్‌సీసీ స్క్వాడ్రన్ ఘన స్వాగతం పలికింది. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ, విద్యావేత్త, రచయిత, ఫిలాంత్రోఫిస్ట్ అంజలి గుప్తతో పాటు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.